నల్లబట్టలు

మత మౌఢ్యం నల్లమందు లాంటిది. ఆ మాటంటే నిజమే ననిపిస్తుంది.

అహంకారం అజ్ఞానానికి నాంది. అవునవును. ఆ మాటా నిజమే ననిపిస్తుంది.

బాధ్యత చాలా బరువైంది....

అది మనం మోసేటప్పుడు నిజమనిపిస్తుంది.

కానీ, జీవితం?.... అది వేరు... ఈ మాటలన్నింటి మధ్యనుంచీ సాగిపోయి అది ఒక కొత్త స్వరూపాన్ని సంతరించుకుంటుంది.

నేను ఈ దేశంలో పుట్టి పెరిగిన సామాన్యపు ఆడపిల్లను. దేశభక్తితో అన్యాయాన్ని ఎదిరించాలని ఆకలి చావుతో చచ్చిపోయిన నా తండ్రి నాకు పెట్టిన పేరు "ప్రియభారతి."

నా వాతావరణంలో తులసి పూజలు,. ఖడ్గ సృష్టులు, రైలు రొఖోలు, లెక్క పెట్టి రోజుకు ఇంతమందిని కాల్చాలన్న మాస్ హిప్నాటిక్ సజెషన్స్, మతాల మారణహోమాలు, మిరపకాయలు అరవై రూపాయిలు అయినా 'అయ్యో...' అని దవడలు నొక్కుకుని, మళ్లీ పది నెలలకు సరిపడ పచ్చళ్లు పెట్టే వృద్ధ పిడివాళ్ళు, వాళ్ళను కాదన లేని రుచుల నాలుకలు, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచెయ్యాలని గంటలు కొద్దీ ఏ పనీ చెయ్యకుండా కబుర్లు చెప్పే కర్పూర వసంతరాయుళ్లు – ఇలా ఇదేమిటి అనేక రకాల చీకాకుల మధ్య, అర్థం చెప్పలేని ఐడియాలజీల మధ్య పెరుగుతున్నదాన్ని నేను.

మర్చిపోయాను.... ఆడదానికి ఐడియాలజీ ఏమిటి?! అర్థం అయినా కాకపోయినా ఆచారాల్ని కాదనడమేమిటి?

అందుకనే, ఆలోచించకుండా, ఆలోచించనీయకుండా రేషన్ కార్డుల దగ్గర నుంచి, బలవంతంగా ఓటు వేయించడం వరకూ సకల చికాకులు తేగల సమర్థమైన పాలకులకు ఓటు వేసేస్తాను నేను.

ఇప్పుడు సమస్య నా ఆడబిడుచు. పద్దెనిమిదేళ్ల అరుణ. అందమైంది. "నా రక్తం ఎరుపు.... నా ఆలోచనే పిలుపు..." అంటూ స్లోగన్లు చెబుతూంటుంది,

మా అత్తగారి దౌష్ట్యానికి భయపడి, అన్నీ ఎవరో ఒకరం సర్ది పెడుతూంటే, ఏది ఎలా వస్తోందో కూడా తెలియని ఒక రకమైన అమాయకురాలు. కానీ వాదనలో ధైర్య సాహసాల్లో....

మా అత్తగారి కుటుంబంలో మొదటి పాంటు షర్టు. ఫుల్ పంజా. ఏ పంజాబులోనో పుట్టి వుంటే పిస్తోలు పట్టుకు తిరిగేదేమో... అప్పుడప్పుడు ఆ పిల్లను చూసి నోరావలించడం తప్ప ఎవరం ఏం చెయ్యలేము. కారణం ఇంట్లో అడిగే హక్కున్న అన్నయ్య మెతక. "ఎప్పుడో ఎవడితోనో లేచిపోతుంది ఈ పెంకెదిది" అని ఒణుకుతూ వుంటారు మా అత్తగారూ, ఆవిడ అత్తగారూ కూడా.

పరాయి పిల్ల అయితే ఏమనేవారో కానీ, సొంత పిల్ల కాబట్టి "దానికి సాహసం ఎక్కువ. కానీ, చూశావుటే... ఛస్తే పరాయివాడి వంక చూడదు...." అని సమర్థించుకుని బతికేసే వృద్ధ జంబుకాలు వాళ్ళు.

"అయినవాడుంటేగా.... పరాయి వాడెవడో తేల్చుకుందుకు" అనేసి బూట్లు టకటకమనిపిస్తూ వెళ్ళిపోయేది అరుణ. అరుణ ఆలోచన లేని ఆవేశం, అర్థం చేసుకోలేని ఉద్యమం, ఎవరేది చెబితే, అది విని సుడిగాలికి కొట్టుకుపోయే ఆదర్శం... ఇవన్నీ చూస్తే నాకు కొంచెం భయంగానే వుండేది.

అదే నిజమైంది ఆ రోజు.

అరుణ ఈడ్చి లెంపకాయ కొట్టింది నడి రోడ్డు మీద. ఒక మొగాడిని... ఆడపిల్ల అయి వుండి మొగాడిని కొట్టడమే కాకుండా, చాలా డబ్బున్న, డబ్బిచ్చిన మదమాత్సర్యాలున్న రావుగారి అబ్బాయిని కొట్టింది! కారణం – అసభ్యకరమైన వాగుడు, చెయ్యి పట్టుకుని లాగడం లాంటి అతనికి చాలా మామూలైన ఆట. "కొట్టడంతో ఆగాను.... నడిరోడ్లో ఉప్పుపాతర వేయాలసలు...." పళ్ళు పటపటలాడిస్తూ 'సగటుమనిషి'లో హీరోయిన్లా అరచింది.

కానీ .... ఆ సాయంత్రం శ్రీముఖం వచ్చింది.

"ఏమనుకుంటోంది అది... ఈ రాత్రి పన్నెండు గంటలకు దాన్ని ఎత్తుకు పోయి..." అక్షరాలు ముడతలుపడ్డాయి అసభ్య వాక్యనిర్మాణంలో....

నా గుండెలు మోకాళ్ళలోకి జారిపోయాయి ఆ ఉత్తరం చూడగానే.

"సమయానికి అన్నయ్య కూడా లేరూ!" మెల్లిగా అన్నాను.

"ఆ! అంటే తల తీసి మొలేస్తాడు మొగాడు. మీ ఆయన సమర్థతే చెప్పా ఒంట్లో తెల్ల రక్తం మనిషి..." ఆవేశంతో ఊగిపోతోంది అరుణ.

"ఆడపిల్లకు అణకువా, వినయం...." ఎలాగూ ఏ కంట్రోలూ చెయ్యలేనని తెలిసిన వృద్ధాప్యపు జులుం ఇంట్లో సణుగుతోంది.

తెల్లారితే? చీకట్లోకి చూశాను....

పక్క ఫ్లాటులో కొట్లాట... "అన్నం పెట్టొద్దు వాడికి, సంపాదించి తేకపోతే... జులాయి తిరుగుళ్ళు...." అని చేతికి ఎదిగొచ్చిన కొడుకు, చేతికి అంది రాలేదని బైటకు తోసేస్తున్నాడు ట్యూషన్లు చెప్పి సంపాదించే మాష్టరు. గుడ్లనీరు కుక్కుకుంటోంది. మాతృత్వం.

"అమ్మా! అమ్మా!" పసి చేతులు, పసి మాటలతో మూసి వున్న పక్కగదిలో, తండ్రి బైసెన్సుదు కామానికీ, బలవంతపు కోరికకు బలైపోతున్న తల్లిని పిలుస్తున్నాయి.

"పిల్లండీ... పిలుస్తోంది.... ప్లీజ్...."

ముందు ఎవరైనా వింటారని మెల్లగా, ఆ తర్వాత భరించలేక గట్టిగా అంటోంది పాతివ్రత్యాన్ని మరుగుపరుస్తూన్న - మాతృత్వం.

కింద ఫ్లాటులో మంగళ తోరణాలు .... మధ్య ఫ్లాటులో తండ్రి పోయిన బిడ్డల ఆక్రోశాలు....

అంతా గందరగోళం. ఒకళ్లింట్లో కాలింగ్ బెల్లుకు పక్క వాళ్లు తలుపు తీయడం, పైన ఫ్లాటులో "పాలు" అని అరుపు వినిపిస్తే కిందవాళ్లు గిన్నె తీసుకుని బైటకు రావడం సర్వసామాన్యమైపోయినాయి. అందుకే ఇల్లాంటివి వేటికీ రియాక్ట్ కారు. టేషను మీద ఏమిస్తారో కలిసి ఆలోచిస్తారు. నీళ్లు రాకపోతే కలిసి పోట్లాడుతారు. కానీ, పక్కింట్లో బియ్యం లేకపోతే పట్టించుకోలేరు. ఎవరి జీవితం వారిదే. ఈ కలగాపులగాల గందరగోళపు ఫ్లాటు నాగరికతలో ఎవరి గొంతు వారే వినాలి....

మరి ఈ జనారణ్యపు ఒంటరితనంలో ఈ పిల్ల గురించిన మథన నేను ఎవరికి చెప్పాలి?

చీకట్లో మేడ మీద నుంచి తొంగి చూశాను. భయం.... గుండెలు పట్టుకుపోయినట్లైంది. ఇంటి చుట్టూ మూక.

స్కూటర్ల మీదా, సైకిళ్ల మీదా.... కొంచెం దూరంగా కొంతమంది ఎదురు బదురుగా... అక్కడక్కడ .... రావుగారి అబ్బాయి గాంగు.... నలుగురైదుగురు నాకు తెలుసు.

ఆ రోడ్ల మీద వాడిదే జులుం... వాడి గాంగు చిరపరిచితులు అందరికీ... వాడి బలానికి భయపడీ, ఆ భయానికి భయపడీ రావుగారిని కౌన్సిలరును చేసిన సచ్ఛరిత్రులు మా కాలనీవాళ్ళ బలం. భయం తెలుసు నాకు డబ్బు బలం, శారీరక బలం, పదవి బలం.... అర్థమైన అజ్ఞానపు బలం వాడిది. నైతిక బలం, ఆధ్యాత్మిక బలాల గురించి వినడమే కానీ, అనుభవం ఎరగని జనం, వాటి గురించి మాట్లాడుకుని తృప్తిపడుతున్నంతకాలం రావుగారి అబ్బాయి రాజ్యం సాగుతూనే వుంటుంది. తప్పదు.

దేనికీ అర్థం లేని, స్వార్థానికి మాత్రం ఉపయోగపడే సాంఘిక, నైతిక సూత్రాలు కొన్ని సృష్టించుకుని బతికేస్తున్నారు జనం. "నేను సైతం...." పాడుకుంటూ పిల్లల్ని దేశానికి ప్రసాదిస్తున్నారు. ఈ పెరిగే జనం, పెంచడం చేతగాని తల్లిదండ్రుల చేతుల్లో పెరుగుతున్న జనం దేనికి భయపడతారో, ఎందుకు ఒణుకుతారో తెలిసినవాళ్లు రావుగారి కుటుంబస్థులు.

బతిమాలి చెపితే వినని విషయాలు, సైకిలు చైన్లు, సోడా బుడ్లు, బలాత్కారాలు, నోట్ల కట్టలు కనిపించి, ఒప్పిస్తాయని తెలుసు వాళ్ళకు. అదోక విడికులం. ప్రత్యేక మతం... వాళ్ల గోత్రం మాత్రం "జులుం."

అందుకే ఎదురుతిరిగిన 'అరుణ'ను అంతటితో వదలకూడదని తెలుసు రావుగారి అబ్బాయికి.

"ఇది ఊరా వల్లకాడా? అలా రౌడీ వెధవలు ఇంటి చుట్టూ చేరితే మాట్లాడరేం ఒక్కరైనా?" ముసలమ్మగారి సణుగుడు.

భయాలకు, జ్వరాలకు, గవదబిళ్లలకు దడుపు విభూది పెట్టే ఈ ముసలమ్మ చిటికెడు ఆశీర్వాదం పెట్టదేం? పెట్టదు, పెట్టలేదు. కారణం – ఈ భయం అర్థాలకు అతీతమైంది కాదు కాబట్టి. ఎదుట చీకట్లో వెలుగుతున్న సిగరెట్టు నిప్పు, సైకిలు చైను, కళ్లల్లో కసి చాలా అర్థమైనవి కనుక. ఇవి వాటిలా గుండెల్లో ఏదో దడుపు కాదు. నరాలు చల్లబరిచే భయం. నిర్జీవతతో జీవితాన్ని పారలైజ్ చేసే ఏదో గుబులులాంటి భయం.

ఏం చెయ్యాలిప్పుడు? పోలీసులకు ఫోను చేస్తే... వెంటనే వాళ్ల "లంచాలు, చందాలు, వంకర చూపులు, ఫిర్యాదు ఇవ్వడానికి వచ్చిన ఆడపిల్లను లాకప్పులో వుంచి ఉరెయ్యగల రావుగారి ఇన్‌ఫ్లుయన్స్ గురించి గత చరిత్ర....

అమ్మో... ఆ తద్దినం పిలిచి తెచ్చుకోవద్దు... డబ్బులున్నవాళ్లకే పోలీసులు... మనకు కాదు...

ఏం చెయ్యాలి? అరుణను ఎత్తుకుపోతే? ఆ భయంకరమైన ఉత్తరం కళ్ళముందు... మానభంగం, చిత్రహింస..., అమ్మో! కళ్ళు మూసుకుని ఆలోచించాను.... ఏం జరిగితే ఏం చేస్తాం?

అయితే ఏం!? డి. కామేశ్వరిగారి కథ గుర్తుకు వచ్చింది... అసలు, ఈ మానాలకు ఇంత గౌరవాలిచ్చి, ఆ అమ్మాయిలను సాంఘికంగా పొడిచి చంపి మనమే ఛండాలురకు ఇంత క్రేజు పుట్టిస్తున్నామేమో! ఏమవుతుంది!? ఒంటికి బురదైతే కడిగి తలంటిపోసి లోపలికి తెచ్చుకోమూ?

అమ్మో! ఏమిటి ఇలా ఆలోచిస్తున్నాను. కానీ, ఆ ఆలోచనతో ఏదో ధైర్యం వచ్చింది. అరుణ భుజం మీద చెయ్యి వేశాను.

"వదినా!" అరుణ గొంతులో వణుకు ఏదో బెదురు.... గుండెల్లో తలదాచు కుంది పద్దేనిమిదేళ్ల పసిపిల్లలా. కష్టంలోనూ నవ్వొచ్చింది నాకు ఒకొక్క మనిషిని ఒకొక్క రకంగానే ఊహించడం ఎంత తప్పు? ఎన్ని కోణాలు ఈ మనుష్యుల్లో!?

మెల్లగా రాత్రి ఆవహిస్తోంది.

"ఏమిటి గోల? ఇంటి చుట్టు ఈ రౌడీ గాంగేమిటి?" అంటూ ఇంటి చుట్టు పక్కలవాళ్లు ప్రశ్నిస్తున్నారు. కొంత మంది సమాధానం తెలిసీ, ప్రశ్నించి తలుపులు వేసుకుంటున్నారు మాట్లాడిన ప్రతి ఒక్కరూ–

"ఆడపిల్లకు అంత దుడుకా! పైగా రౌడీ వెధవతోనా కాలు దువ్వడం!? అని అరుణను తిట్టి, అలా పెంచినందుకు మమ్మల్ని తిట్టి, ఎవరిళ్లల్లోకి వాళ్లు దూరిపోయారు.

ఏం చెయ్యాలి?.... ఇద్దరు ముసలమ్మలు, ఇద్దరు ఆడవాళ్లం. ఏమిటి దారి? అర్ధరాత్రి రౌడీ గాంగ్ ఇంటిమీదకు రైడ్ చేస్తే..? వాళ్లు ఇలా చేసి పిల్లల్ని ఎత్తుకుపోయిన కథలు చాలా వున్నాయి.

వెంకట రమణమూర్తికి ముడుపులు కడుతోంది ముసలమ్మ ఏడుస్తూనే ఏవో మొక్కులు మొక్కుతోంది.

"అమ్మా! దణ్ణం పెట్టుకోవే తల్లీ దీర్ఘాలు తీస్తోంది. అలవాటుగా దణ్ణం పెట్టాను నేను. అరుణ కూడా కన్నీళ్ళు తుడుచుకుంటూ చేతులు జోడిస్తోంది. అంత టెన్షన్‌లోనూ, నవ్వొస్తోంది నాకు

'దేముడా! నువ్వు భక్తవశంకరుడివో కావో కానీ కొంతమందికి నీ పేరు మాత్రం 'భయం?'

బయట ఏదో కలకలం.... ఉలిక్కి పడ్డాను నేను....

మా చిన్న కిటికీ చీకటిలోనుంచి జోలెడంత భయాన్ని లోపలికి మోసు కొస్తోంది.

స్ట్రీటు మొత్తం కనబడని భయం వరదలా ముంచెత్తుతున్నది. గుంపులు గుంపులుగా జనం.... విడ్డూరంగా చూస్తూ, చేతులు వెనక్కు పెట్టుకుని మా రోడ్డు తప్పుకుని పక్కరోడ్డు మీదుగా పోతున్నారు వాళ్లు.

"ఒక్కరూ ఆలోచించరేం.... ఏం భయపడకండి, మేమున్నాం అనరేం" ఒణుకుతోంది అరుణ.... ఆ పిల్లకు తెలుసు రావుగారి పరపతి, అతడి కొడుకు రాక్షసత్వం... నా చేతుల్లో ఆమె వున్న అరిచేతులు ఐసుగడ్డల్లా వున్నాయి.

'పిచ్చితల్లీ! గుండెల్లో నిబ్బరం, జీవించే ధైర్యం – కేవలం ఫాంటు, షర్టు, నోటిదురుసుతనం, కేర్‌నాట్ సైకాలజీ ఇవ్వవు. దానికి కావలసిన ధైర్యం వేరు...' ఆలోచిస్తూ ఆ పిల్లను దగ్గరకు తీసుకున్నాను.

"దేశంలో ఆకలి కరాళ నృత్యాన్ని చూసి, అందరికీ ఆకలి తీర్చాలని విప్లవ కారిణిని అయ్యాను. నా మానాన్ని, ప్రాణాన్ని తృణప్రాయంగా త్యజించి, మంచులాంటి ఒంటిరితనం గుండెలనిండా ఆవరిస్తున్నా అలాగే తిరిగాను. కానీ, నా ఆకలి బాధ.... దాన్ని తట్టుకోలేక పోలీసులకు లొంగిపోయాను...." పేపర్‌లో లొంగిపోయిన విప్లవకారిణి కథ గుర్తుకు వచ్చింది.

ఏకాస్త కలకలమైనా ఒంట్లో ఏదో కుదుపు.

ఆలోచించకుండా వుండాలని ప్రయత్నిస్తున్నాను.

నిశ్శబ్దం.... అది ప్రశాంతమైనది కాదు... టెన్షన్‌కు ప్రతిరూపంగా వుంది.

"డామిట్! ఒక్కళ్లు కూడా ఇదేమిటని అడిగేవాళ్లు లేరా? వెధవ దేశం.... ఏదైతే అదవుతుంది? నేను బయటకు వెళ్లిపోతాను వదినా.... ఏం చేస్తారో చెయ్యనీ .... నా వల్ల ఇంతమందికి టెన్షన్!" హిస్టీరికల్‌గా అరుస్తోంది అరుణ.

అది ఆ అమ్మాయి త్యాగం, ఆవేశం చూసి సంతోషించే సమయం కాదు. అది ఫక్తు హిస్టీరియా.

"ఊరుకో అరుణా!"

ట్రింగ్ ట్రింగ్... నిశ్శబ్దంలో టెలిఫోన్!

"మీకు ఫోనొచ్చింది...." పక్కింటి అమ్మాయి భయంగా చెప్పి తుర్రుమన్నది.

"హల్లో!"

"నేను రమణని. ఏమిటక్కడ గోల... మీ ఇంటికి వద్దామని బయలుదేరి వస్తూంటే.... మీ ఇంటి చుట్టూ జనం... అందుకనే మెయిన్ రోడ్డు షాపు నుంచి ఫోను చేస్తున్నాను.'

నా దూరపు తమ్ముడు, ఆ మాత్రం అడిగినవారు లేరేమో మమ్మల్ని... గబగబ చెప్పేశాను విషయమంతా...

"ఏదన్నా చెయ్యరా తమ్ముడు!...." నాకు ఏడుపు ఆగడంలేదు. "వాడిని ఎలా, ఏదీ, ఏమీ చెయ్యలేం ప్రస్తుతం..." రమణ అన్నాడు.

"వాడు నీ స్నేహితుడు కదరా!"

"అవును... కానీ .... చూద్దాం...."

ఆలోచిస్తున్నట్టున్నాడు రమణ అటు ఇటు టెన్షన్‌తో ఒణుకుతున్నాను. నేను.

"ప్రతి మనిషికీ ఏదో వీక్‌నెస్ వుంటుంది. ఈ రాక్షసుడికీ వుంటుంది. ఊ! సరే.... అరుణను బైటకు పోనీయకు. నేను ఏదో ఒకటి చేస్తాను...." రమణ మాటలు దేముడి మాటల్లా వున్నాయి ఫోనులో.... అంతకన్నా దిక్కులేని స్థితి అది.

"ఇదుగో స్లీపింగ్ టాబ్లెట్... వేసుకుని నిద్రపో. రమణ ఏదో ఒకటి చేస్తానన్నాడు..." ఇంటికి వచ్చి అరుణను కదిపాను.

"ఏమిటి వదినా చేసేది? ఒక్క మొగాడు.... ఒక్క మొగాడంటే ఒక్క మొగాడు..." అరుస్తూనే వుంది అరుణ.

కొంతసేపటికి,

ముసలమ్మ గోడకు ఆనుకుని

అత్తగారు మంచానికి అడ్డం పడి,

అరుణ కిటికీ దగ్గరనుంచి కిందికి జారి,.

నేను గుమ్మం దగ్గర....

తెలియకుండానే నిస్పృహలోకి స్పృహతప్పిపోయాము.... అది నిద్రకాదు. అన్నీ మర్చిపోయి విశ్రాంతి తీసుకోమని సబ్‌కాన్షస్ సంధించే సమ్మోహనాస్త్రం.

❀ ❀ ❀

కాలింగ్ బెల్.... ఉలిక్కిపడి లేచాను.

తెల్లవారింది.... పాల పేకెట్లు.

రోడ్డు మీదకు బెరుగ్గా చూశాను. అంతా మామూలుగా వుంది. ఏమయ్యారు వీళ్లంతా? ఏమైనట్టు?

టెన్షన్‌తో మరింత తెల్లవారింది

అప్పుడు వచ్చాడు రమణ.

చుట్టూ మూగాం అంతా, ఏమైందని....

"ఏమైందా? అటుచూడు ...." నవ్వుతూ కిటికీలోనించి చూపించాడు.

నల్లబట్టలతో, మాలతో రావుగారి అబ్బాయి స్కూటర్ స్టార్ట్ చేస్తున్నాడు.

"అదేమిటి? ఆ త్రాష్టుడికి మాలేమిటి?" పళ్లు పటపట కొరుకుతూ అన్నది అరుణ. వెలుగు పెరగడంతో వెరపు తగ్గిపోయినట్లుంది అమ్మాయికి.

"చిన్న ట్రిక్ చేశాను. మిమ్మల్ని రక్షించాలంటే ఏం చెయ్యాలో అర్థం కాలేదు నాకు. అర్ధరాత్రి అరుణను ఎత్తుకుపోదామన్న ప్లానుతో వున్నాడని తెలిసింది. ఏం చెయ్యాలా అని ఆలోచించాను. వీడికి చదువు ఎలాగూ అబ్బలేదు. వాడికి ఏదో ఫ్యాక్టరీ పర్మిట్ తెప్పిస్తానన్నాడు వాళ్ల నాన్న. ఆ విషయం జ్ఞాపకం వచ్చింది. దానికి లంచాలు తినే మధ్యవర్తి నాకూ తెలుసు. ఆయన దగ్గరకు వెళ్లి చెప్పవలసినదంతా చెప్పాను. రాత్రి ఆయన కబురు పెట్టాడని వీడ్ని మీ రోడ్డు దగ్గరనుంచి నేనే తీసుకుపోయాను."

"ఎలా వచ్చాడు? నీ మాట ఎలా నమ్మాడు?"

"ఆయన తాలూకు మనిషిని వెంటబెట్టుకు వచ్చాలే. ఇంటికి తీసుకువెళ్లిన తరవాత బ్రెయిన్ వాష్ చేశాను కొంచెం. ఆ మధ్యవర్తి అయ్యప్ప భక్తుడు. మాల వేసుకున్నాడు. 'నువ్వు తెల్లవారుఝామునే మాల వేసుకుని ఆయనకు కనబడు. పొద్దున్నే నీ పని అయిపోతుంది' అని చెప్పాను.

"స్వార్థం ముందు అరుణ సమస్య, పౌరుషం నిలవదని నాకు తెలుసు. పైగా ఎంత దుర్మార్గుడైనా లౌక్యం, డబ్బు మీద పేరాశ వున్నవాడెప్పుడూ ప్రియారిటీలు తెలిసినవాడవుతాడు. అర్ధరాత్రి టైలరును లేపి బట్టలు కుట్టించాను. పొద్దున్నే ఆ మధ్యవర్తిగారిని కలిసాం. ఆ లోపలే మాల వేశాం. ఎలాగూ లంచాలు తిన్నాడు.

"రెండు రోజుల్లో నీ పని అవుతుంది బాబూ! స్వామి శరణం" అన్నాడు. అది ఎలాగూ అయ్యేవనే. కానీ, ఆ క్షణం దాన్ని, నా పరిచయాన్ని అలా ఉపయోగించుకున్నాను.... మిమ్మల్ని రక్షించా నంతే...." రమణ సన్నగా, వంకరగా నవ్వుతూ చెప్పాడు.

"నా నాయనే - నా తండ్రే...." ముసలమ్మ, అత్తగారూ హడావుడి చేసేస్తున్నారు. అరిటాకు, వేడివేడి ఉప్మా, బోలెడంత ఆప్యాయత, అరుణ కళ్లల్లో మెరుపు.... నవ్వొచ్చింది నాకు. మొత్తానికి బ్రతకనేర్చినవాడు రమణ.

"ఆ అయ్యప్ప ఉన్నాడో లేదో కానీ, ఒరే రమణా! ఈ ఆచారం మాత్రం బావుందిరా! అర్ధరాత్రి నిద్రపోయి, పొద్దెక్కి నిద్రలేచే జనం అంతా చక్కగా స్నానాలు

చేసి, పొద్దున్నే పనుల్లోకి దిగిపోవడం, వెకిలి వాపులు, పిచ్చి లక్షణాలు మాని, కాస్త భయం భక్తి.... కానీకి గతిలేనివాడికి కూడా నల్లబట్ట లుండగానే పాదాభివందనం.... ప్రతి నీ ఈడు వెధవా తాగి తందనాలాడడమేనాయె. అల్లాంటిది దీని పుణ్యమా అని ఒద్దిగ్గా, తలకాయ వంచుకుని తప్పుకుపోతున్నారు!..." సహం డిగ్రీ చదువుతూ మానేసిన మా అత్తగారు మాట్లాడేస్తున్నారు.

"అవును.... మాల వేసుకున్నాడని రావుగారి డ్రైవరు కాళ్లకి ప్రొద్దున్నే యువరాజావారు దణ్ణం పెట్టారు. బోలెదంత కాబట్టే "మార్పులే...." హుషారుగా అంటున్నాడు.'

ఆలోచిస్తున్నాను నేను.

❀ ❀ ❀

మర్నాడు ఒక తమాషా జరిగింది.

నడిచి గుడికి కాబోలు వెళుతున్నాడు రావుగారబ్బాయి, చెప్పులు లేకుండా.

ఎదురుగా పుస్తకాలు పట్టుకుని స్పీడుగా దూసుకుపోయింది జూట్లు టకటకలాడిస్తూ అరుణ.

ఇద్దరూ చూసుకోకుండా ఢీకొట్టుకున్నారు.

"సారీ! స్వామి శరణం...." లెంపలేసుకుంటూ పక్కకు జరిగిపోయాడు రావుగారబ్బాయి. ఆ తొలగిపోవడంతో రేపు లైసెన్సు రాదన్న భయం వుంది. రూల్సు సరిగ్గా పాటించకపోతే మొక్కుతీరదన్న భయం వుంది. అందర్నీ చూసి నేర్చుకున్న ఆదర్శం వున్నది. "స్వామి అయ్యిండి...." అని నలుగురూ నాలుగు అంటారన్న కన్నెస్వామి భీతి వున్నది.

అదేదన్నాకానీ... అతని రాక్షసత్వాన్ని కంట్రోలు చేసింది. అతనిచేత సారీ చెప్పించింది. అది ఎవరికీ? అరుణకు!...

ఆశ్చర్యపోతూ చేతులు జోడించింది అప్రయత్నంగా అరుణ. అరుణ నల్లబట్టలకు నమస్కరిస్తోంది. ఆమెలో బెరుకు వుంది. కొంత ఆశ్చర్యముంది. అతని మార్పు గురించిన అపనమ్మకమున్నది.

అయినా సరే.... అన్నది. "సారీ! స్వామి శరణం" అన్నది మెల్లిగా.

అటే చూస్తూ ఆలోచిస్తున్న నాకు అర్థమైంది కొంత.

ఆచారానికి వెనకాల వున్నది అందమైన అవసరం. దాన్ని కాపాడేది పేరు పెట్టిన భగవంతుడనే భ్రాంతి. అందుకే ఎంతమంది ఎన్ని స్లోగన్లు చెప్పినా నా దేశం నుంచి మతం పోవడం లేదు. దానికి కారణం మార్మికత, ధార్మికత, కార్మికతకు గౌరవం వుండో అగౌరవం వుండో కాదు. ఇక్కడ అహింస, ధర్మం, సత్యం. సమానత్వం ఏదో ఒక మతాన్ని దాని పాలికాపనుకునే భగవంతుణ్ణి అడ్డం పెట్టుకుని బతుకుంది. మొట్టిన ఉంగరాల చేతిని ముద్దుపెట్టుకునే అలవాటున్న ఈ మనిషి భయం, భక్తి అన్న బావుటా లేనిదాన్ని నమ్మడు.

ఇక్కడ సెంటిమెంటు కావాలనుకున్న వ్యక్తికి, ఆప్యాయత ఆదరణ వేలి కొనల స్పర్శలో పొందాలనుకున్న వ్యక్తికీ, అవసరంలో ఆదుకునే అప్యాయతా పరిమళాలు కావాలనుకునే వ్యక్తికీ వేటికి వాటిగా పొందే అదృష్టం లేదు.

కార్తీక మాసం అడ్డం పెట్టుకుంటే కానీ అన్నదానాలు చెయ్యరు ముత్తైదువులు. పేరంటాళ్ళ పేరు చెబితే కానీ అవసరానికి చీర, జాకెట్టు పెట్టరు. పాపం, నరకం పేరు చెబితే కానీ, దేవాలయాలు పోషించబడవు.

విడిగా అన్నం పెడితే దండగ. దుబారా పండుగనాడు అన్నం పెడితే సంతర్పణ. ప్రతి నవ్వుకు పాతివ్రత్యపు ముసుగు కావాలి.

లేకపోతే అది బజారున పడిపోతుంది. ఉద్వేగానికీ, ఉద్రేకానికీ, ఆనందానికీ ఆమోదపుముద్ర కావాలి.

పిక్నిక్‌లకు వెళ్లి సముద్రంలో దిగితే అది విచ్చలవిడితనం.

శ్రీరామ నవమి నాడు వసంతాలాడితే అది పరమ పవిత్రం.

కామితార్థాలు తీరడానికి కాముడిపున్నమి చేసే దేశం ఇది.

ప్రతి దానికీ లైసెన్సు "అర్థం తెలుసుకోనక్కర్లేని ఆచరణ"లో వుంది.

ఇక్కడ ట్రాన్స్‌మిషన్ థియరీ చెప్పాలన్నా తాయత్తును, తీర్థాన్ని, తాంబూలాన్నీ, తత్వజ్ఞానాన్ని, తర్పణను ఆలంబనంగా తీసుకోక తప్పదుమరి

ఇది ఈ దేశపు జీన్స్‌లోనే వుంది.

"ప్రవక్ష్యామి గీతార్థేన" అన్నాడు కాళిదాసు.

బహుశా అంతకుమించిన క్థోనిజమే వుండదేమో! (Chthonism - Humansism) లు

ఈవిల్, సిన్ మొదలైన పదాలను వాడేటప్పుడు
న్యాయం ధర్మం నీతీ త్యాదుల చర్చించేటప్పుడు
ఎవరికి తోచిన అర్థం వారలు చెప్పక తప్పదు:
పరమార్థం సామాజిక సామూహిక సద్వర్తన.

అన్నారు శ్రీశ్రీ

బుద్ధుణ్ణి దేముణ్ణి చేసి 'బుద్ధిక్ ప్లేన్'ను మర్చిపోగలరు జనం. రేపు చరఖాకు దండ వేసి, హారతిచ్చి, గాంధీగుడి కట్టించినా ఆశ్చర్యపోనక్కర్లేదు. శ్రీశ్రీకి మఠం కట్టి, పాలరాతి గోడలనిండా ఆయన కవితలు చెక్కి పవిత్రత ఆపాదించి, ఆ పదాల మధ్య వేడిని, వాడిని, విషాదాన్ని, విప్లవాన్ని మెల్లిగా మరిచిపోగలరు ఈ జనం....

దేనిని దానిగా చూడగల కనువిప్పు నా దేశం ప్రజలకు కలిగే రోజుకోసం వెల వెలా పోతున్న ఆకాశంలో వెలుగు రేఖకోసం ఎదురుచూస్తున్నాను. నేను ప్రియ భారతిని.

(ఆంధ్రజ్యోతి వారపత్రిక – 30-12-1988)